తొందరపడటం. ఏమయినా సరే లోకాన్ని ఎదిరించాలి. అలివేణిని వివాహం చేసుకో కూడదు. అంగీకరిస్తే యేముంది, ఆశ్రయించిన తప్పితే ?—అలివేణికి కలగబోయే పుత్రుడిని తను పెద్దకొడుకుకింద చూచుకోవాలి. ఎంతటి సహనంగల మానవుడికైనా యిది సాధ్యమవుతుందా ? తను ఎవరితోనూ చెప్పకుండా బైరాగుల్లో కలిసిపోవాలి.

* * *

ఆ వేదనలు అనంతంగా వున్నా, కోపాలు పాపాలు మునిగేటట్టు వున్నా, హాస్యరసం మాత్రం ఎప్పటికప్పుడు ఉత్పత్తి అవుతోంది తనకి మాత్రం దీని అంతేమిటో చూస్తేగానీ తనకి నెలఅయినట్లు చెప్పాలని లేదు. అచ్యుతం బావ ఉరుములు కమ్ముతూ వచ్చాడు క్రిందికి. వాళ్ళతో దెబ్బలాడుతాడు గాబోలు. కానీ వాళ్ళతో దెబ్బలాడకుండానే వీధిలోకి వెళ్ళిపోయాడు.

మళ్లీ తిరిగి కొంతసేపటికి వచ్చాడు. అత్తయ్య ఏమేమో మాటాడుతోంది అమ్మతోటి. మధ్యమధ్యలో కట్నం ప్రసక్తికూడా రావటం అవుతోంది. ఇక వదినెల గుసగుసలకి అంతే లేదు.

అచ్యుతం బావ అంటున్నాడు "మీ యింటికి రోజూ ఎవడో వచ్చి ఒక అకార్యం చేసిపోతూవుంటే, మరో వ్యక్తి ఆ అకార్యంవలన కలిగిన ఫలమనుభవించడానికి సిద్ధంగా వుంటే తాళికట్టమని మీరు నన్ను ఏ మొహం పెట్టుకొని అడుగుతున్నారు ?"

అచ్యుతం సంకుచిత భావానికి తనకు చాలా అసహ్యమేసింది. మెల్లిగా వెళ్ళి ఓ కుర్చీమీద కూర్చుని అంది అలివేణి "ఎవళ్ళనీ ఉద్ధరించటానికి ఎవళ్లూ ఏ పనీ చెయ్యనక్కర్లేదు. అందరూ మమ్మల్ని ఉద్ధరించటానికి వొచ్చినట్టు మాటాడేవారే. ఎవరిసంగతి ఎవరికి తెలియదు గనుక? ఏమండోయ్...చిన్న వొదినగారూ కొంచెం దూరంగా తొలగండి దాహమవుతోంది కాస్త మంచి నీళ్ళు యిస్తారూ — ఒరేయ్ తమ్ముడూ కాస్త చాప యిలా పడేయరా... ఆనక మేడమీదికి వెళ్ళి నా టేబిలుమీద పుస్తకాలు తే."

అందరూ విస్తుపోయారు. ఎంత సందిగ్ధావస్థలో పడేసింది! మూడు నాలుగు రోజులలో అందరికీ తెలిసిపోయింది డొంకల సంగతి. అత్తయ్య తిరిగి ప్లేటు ఫిరాయించి అంటోంది "ఎంతకయినా తెగువమ్మ వొదినా... నెల తప్పిందంటే మనం గాభరా పడిపోయి ముహూర్తం పెట్టించగానే యిలా తేల్చేసింది. ఎంత లౌక్యమో చూశావుట్రా అబ్బాయ్-మనం మనవూరికి పోయి మూడు నాలుగు రోజులలో కట్నం సంగతి తెలియపరుద్దాము ఎవరిచేతనయినా"

అలివేణి అంది "ఏమండోయ్ అత్తయ్య గారూ, మీ లౌక్యంసంగతి ఎవరికి తెలియదు గనుక? మళ్లీ ఎవళ్లచేతో చెప్పించడమెందుకు—మీకు కావలసిన మూడువేల అయిదొందలూ మా నాన్నగారు యివ్వలేకపోరు. మా యింటి ఆడపడుచుని నేనొక్కత్తినేగా..."

అచ్యుతం అలివేణి చెప్పింది వింటున్నాడు వంచిన తల యెత్తకుండా. ★

# ★ నిశ్చింత ★

## కవికొండల వేంకటరావు

పూర్వం రెండవతరగతి బండీయే ఇప్పటి మొదటి తరగతి బండీ అని అనుకుంటూ రెండు గీతల్లోంచి ఒక గీత కొట్టెయ్యగా నిల్చివున్న ఒక గీతగల పరువుల పెట్టె ఎక్కాడు సుందరరావు. రైలు అసలు మెయిలు. అందులో ఇది పరువుల పెట్టె! మంచి టీగ్గావుంది. పైన మూడు "బెర్తులు", క్రిందో మూడు "బెర్తులు", రెండుమూడు "ఫానులు" ఆ వరుసనే "లైట్లు" ఒక మేజాబల్ల, బూడిదలు వుంచే 'ట్రే'లు, అద్దం నీళ్లుగల "లావెటరీ"—ఏ టన్నిటితోటి ఆ పెట్టె ఏలావుంది? 'అప్సరస' మినహా స్వర్గతుల్యంగా వుంది. అప్సరస రావడానికి అది 'మేల్ రిజర్వు' అయినా అప్సరసలకన్న అందం వొలికించే బొమ్మలున్న 'మాగజీ'నులు ఇంగ్లీషువి తమిళానివి హిందీవి ఆ పెట్టెలో వున్నాయి! ఎలా వచ్చాయి ఇవి మాగజీనులు అని అడుగుతారేమో! అది మెయిలు గాడీ! హౌరానుండి మదరాసుదాకా పోయేది! కూర్చున్న మనుష్యులు కూడా కలకత్తానుండి కొందరు వాల్తేరునుండి కొందరు ప్రయాణిస్తూ వున్న వాళ్ళు ఒకళ్ల భాష ఒకళ్ళకు రాదుగాని, ఒకళ్ల కొకళ్లు అభిప్రాయాల్ని వెలిబుచ్చుకోవడంలో వెంబాటు లేనివాళ్ళు. వాళ్ళూ వాళ్ళూ ఏదో పనిమీద నె వెడుతూవున్నారు షోకారిపోతులు కారు మనంలాగ!

ఒకచోట ఒక స్టేషన్‌వద్ద 'మెయి'లాగింది ముందు బద్దీలమీద. 'టాప్' 'లైన్' బద్దీలమీద 'పుష్' బండి ఆగింది. 'పుష్' బండి కావల కాబోలు ఆ కుటుంబం కుటుంబం, కలిమి కలిగినవాళ్లే, అవసరాన్ని బట్టి ఆ తాపత్రయం పడ్డారు. ఆడా మగా పిల్లా జెల్లా, ఓ పదిమంది రైలు చెంబు, 'టార్చి' దేఖీలతో సహా 'పుష్'బండి క్రిందనుంచి దూకివచ్చి, ఈ మెయిల్గాడీ మొదటి తరగతి బండిలో పడ్డారు. ఆ వెనకాల రైలుకూలీలు సూట్కేసులు బెడ్డింగులు వాళ్లు వచ్చిపడ్డారు.

'పుష్'బండి కదిలింది. మెయిలుబండి కదిలింది. ఒకటి ఒక వైపుకు, ఒకటి మరొక వైపునకు. అంతా ఆశ్చర్యపోయినారు. 'ఎంత మోసమైపోయిందేది! ఆ పుష్బండి మరో నిమిషంముందు కదిలినా, మెయిలు ఎక్కడంలో కదిలినా' అని అంటూ!

ఆ ఎక్కిన కొత్తజనం మాత్రం, వాళ్ళు మళ్ళీ కలిగినవాళ్లు, 'కల్చర్' గలవాళ్లు, ఏమీ అనుకోవడంలేదు. వాళ్లు మెయిలు బండీ పొందిగ్గా ఎక్కి కూర్చున్నారు. ఈ ఖంగారంతా అంతక్రితం బండిలో ఉన్న వాళ్ళదే! ఈ ఆలోచన అంతా బండిలో అంతక్రితం ఉన్న వాళ్లదే!

'ష్లె'? అనగా బండిలో అంతక్రితం ఉన్న వాళ్ళ ఆశ్చర్యం చూసి, ఆఖరుకు కొత్తగా ఎక్కినవారిలో ఒకాయన అన్నారు 'అది మా పరిపాటే! రైలు కూలీల ఎర్ర తలపాగా లేనా అటూ తిరుగుతున్నంతసేపూ ఏ బండీ కదలు, అటు 'పుష్' కదలు! ఇటు మెయిలూ కదల్దు! గంట ఎన్నికొట్టినా, జెండా ఎన్ని చూపించినా, ఈల ఎన్ని వేసినా!" అని.

'బాబా! మేమూ కాదు మా తలపాగాలు కాదు, ఇదంతా భగవంతుడి మాయ! మాయ కాకపోతే మరేంటి? మీరు ఎక్కే అంతసేపూ మెయిలు నిలబడ్డ మేమిటి? నేను దిగేలో 'దిగొద్దు! బండీ కదుల్తూవుంది అని గార్డుగారు అనడమేమిటి? యిద్దూరంగా వుంది నేటి పాడు! తమరు మా దొడ్డమారాజులు మరో రెండణాలు ఇప్పించండి!' అన్నాడు ఒక కూలి బండిలో వుండిపోయి. 'నీ వెక్కడ దిగుతావు మరి?' అన్నాడు ప్రయాణీకుడు రెండణాలు వానిచేత పడేస్తూ, వానివైపు చూస్తూ.

'అంతా భగవంతుడి మాయ చూస్తూ వుండండి! ఎక్కడ దిగుతానో!' అని అల్లా మెల్లిగా దిగాడు కూలీ! బండి వేగం తగ్గించగా! సుందరరావు అన్నాడు 'ఇదంతా కూలీల్లోవుంది' అని తెలుగు భాషను. ఆ భాష రానివాళ్లు తలలు త్రిప్పారు. 'ఎవరిలో మాయ వుంటేం! మెయిలందుకున్నాం!' అన్నారు క్రొత్తప్రయాణీకులు నిశ్చింతగా! ★